కథ

# వీళ్ళు కలిసే ఉంటారు

సీతాసత్య

“నీతో ఇహ మాట్లాడవలసిందేవీ లేదు. ఇప్పటి వరకూ జరిగిన చర్చ చాలు. రేపట్నుంచి నువ్వింటికి రాకపోతే నాకు మహోపకారం చేసిన వాడివవుతావు” అంది సమీర విసురుగా.

అప్పటికి దాదాపు గంటసేపట్నుంచి సమీరతో వాదిస్తోన్న రాజాకు ఆగ్రహం హద్దులు దాటింది సమీర మాటల్తో. “అంటే ఏవిటి నీ ఉద్దేశం? నన్నొదిలేసి ఒంటరిగా ఉంటావా?” అన్నాడు.

“ఆ....”

“ఇది నీకు పుట్టిన బుద్ధేనా? లేక..” అనబోతోన్న రాజాను వారిస్తున్నట్టుగా-

“దారినపోయే వాళ్లు చెప్పే మాటలు తలకెక్కించుకుని అవాకులూ, చవాకులూ వాగే అలవాటూ, కట్టుకున్న వాళ్లను కష్టపెట్టే కసాయితనమూ నాకు లేవు. నిన్ను పది సంవత్సరాలు ఓపిగ్గా భరించిన తర్వాత, ఇహ భరించలేనని అనుకున్నాక చేసుకున్న నిర్ణయం ఇది” అంది సమీర అతడివైపు ఛీత్కారంగా చూస్తూ.

“దారినపోయే వాళ్లంటే నీ దృష్టిలో మా అమ్మా, నాన్నలూ. అక్కచెల్లెళ్లేగా! మన సంసారం బావుండాలని వాళ్లు సలహాలివ్వబోతే సంతోషించి వాటిని ఆచరణలో పెట్టి మొగుణ్ని సుఖపెట్టడం మానేసి నోరుపారేసుకోవడమేనా నీ సంస్కారం?” అన్నాడు రాజా వెటకారంగా.


“హు.. దెయ్యాలు వేదాలు వల్లించడమంటే ఇదే! సంస్కారం ఏ కోశానా లేని వాళ్లు ఎదుటివారి సంస్కారాన్ని ప్రశ్నించడం కంటే కుసంస్కారం మరోటుండబోదు” అంది సమీర నిరసనగా.

“సరే.. ఇంతవరకూ వచ్చాక ఇహ మనం కలిసుండడం అసంభవం. రేపటి నుంచీ నువ్వెవరో, నేనెవరో!” అన్నాడు రాజా దృఢ నిశ్చయానికి వచ్చిన వాడిలా.

“చాలా సంతోషం. ఇంత కాలానికి మంచి నిర్ణయం తీసుకున్నావు. ఇప్పటికే చాలా రాత్రయింది కనుక నువ్వు తీసుకువెళ్లాల్సిన సామాన్లేవైనా ఉంటే సర్దుకుని డ్రాయింగ్‌రూమ్‌లో పడుకుని రేపుదయాన్నే బయల్దేరు” అని అతడికి మరో మాటకవకాశమీయకుండా వడివడిగా పడక గదిలోకి నడిచి తలుపు మూసి గడియ బిగించింది సమీర.

☆ ☆ ☆

పదకొండేళ్ల క్రితం సముద్రపుటొడ్డున ఒంటరిగా కూర్చుని ఎగసిపడుతోన్న కెరటాల్ని తనను తాను మర్చిపోయి తదేక దీక్షతో చూస్తూ ఉండిపోయిన ఆమె వైపు ఆకర్షింపబడి, తర్వాతి దశలో ఆమెతో మాటలు కలిపి, తనతో ఆమె మాట్లాడేలా చేసుకుని ఆ తర్వాత ఆమె పట్ల తనకు గల ఇష్టాన్ని ఆమెకు బదిలీ చేసి అందుకు సమాధానంగా అతడి పట్ల తనకున్న ఇష్టాన్ని పొట్లంగా చేసి ఆమె తిరిగి అందించడం, దానిని మహదానందంగా స్వీకరించి.. మరి కొంత కాలం గడిచాక ఒకరి పట్ల మరొకరికి ఏర్పడిన ఇష్టం ప్రేమ తప్ప మరొకటి కాదని తను నమ్మి, ఆమెను నమ్మించి పెద్దలను ఒప్పించి ఏడాది తిరగకముందే సమీరకు భర్తయ్యాడు రాజా.



అమితంగా ఇష్టపడే ఒక వస్తువును పొందడానికి ముందు ఉండే ఆరాటం, ఆ వస్తువు స్వంతమయ్యాక ఉండదు. అది సహజం. ఇది వస్తువులకే కాదు మనుషులకూ వర్తిస్తుంది.

పెళ్లికి ముందు గలగలా నవ్వే సమీర నవ్వూ, ఆమె వేషధారణా, ముందుకు దూసుకుపోయే మనస్తత్వం, సమస్యలను పరిష్కరించే తీరూ, ఇత్యాదులన్నీ ఎంతో ఇష్టం రాజాకు.

తను చెప్పే మాటల్ని అత్యంత శ్రద్ధగా వినడం, తాము కలిసిన ప్రతిసారీ ఎక్కువసేపు తన మొహంలోకే చూస్తూ ఉండడం, తన ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించడం, తమకు తారస

పడిన ఆడవాళ్లతో పోల్చి తనను ప్రతిసారీ ఆకాశానికెత్తేయడం వగైరా లక్షణాలన్నీ రాజాలో సమీరకు ఇష్టం.

తామిద్దరిలోనూ ఒకరికి నచ్చని విషయాలు మరొకరిలో ఉన్నాయనే విషయం అవగతం కావడానికి పెళ్లయ్యాక దాదాపు సంవత్సరం పట్టింది వాళ్లిద్దరికీ. అద్దె ఇంటి యజమాని అప్పటివరకూ వారున్న ఇంటిని ఖాళీ చేయమనడంతో కొత్త ఇంటికి మారాల్సి వచ్చింది. ఆ ఇంట్లోకి ప్రవేశిస్తూనే "వాస్తు ప్రకారం మంచం ఈ వైపు ఉండాలి. బీరువా ఈ మూల ఉంచితే ఉత్తర దిక్కున బరువు పెరిగి మనకంతా నష్టమే! ఇటువంటి పొరపాట్ల వల్లే ఇంతకుముందున్న ఇల్లు ఖాళీ చేయాల్సి వచ్చింది మనం అకారణంగా" అన్న రాజావైపు ఆశ్చర్యంగా చూసి, "మీకిటువంటి మూఢనమ్మకాలున్నాయని నాకింతవరకూ తెలియదే!" అంది సమీర.

"ఇది మూఢనమ్మకం కాదు నిరూపించబడిన సత్యం" అన్నాడు రాజా, ఇందులో వాదనకు తావులేదన్నట్టుగా.

కొత్త ఇంటికి మారిన మొదటి రోజే అతడితో గొడవెందుకులెమ్మని సరిపెట్టుకుని వంట ప్రయత్నంలో పడింది సమీర. ఏ వస్తువెక్కడుందో వెతుక్కునే ఓపికలేక దొరికిన సరుకులతో వంట పూర్తయిందనిపించి రాజాను భోజనానికి పిలిచింది.

"ఇదేవిటి?" అన్నాడు రాజా. సమీర కంచంలో వడ్డించిన నల్లగా ఉన్న పదార్థాన్ని చేత్తో పట్టుకుని చూపిస్తూ.

"ఏదో ఒకటి.. తినే పదార్థమే. ఒంట్లో ఓపిక లేకపోయినా ఇంట్లోకి దిగిన మొదటి రోజే బయటి నుంచి తెప్పించుకోవడం ఎందుకని కష్టపడి వంట చేశాను. ఈ పూటకు సరిపెట్టుకోలేవా?" అంది అప్పటికే పనితో ఒళ్లు పులిసిపోయి ఉన్న సమీర.

కంచాన్ని ముందుకు తోసేసి లేచాడు రాజా. "అంత కష్టపడి చేసిన వంటేదో నువ్వే రుచి చూసి తరించు" అంటూ.

"ఏం ఒక్కరోజుకు సర్దుకుని తింటే నీ ఆరోగ్యం చెడిపోతుందా?" అంది సమీర అతణ్ని విసుగ్గా చూస్తూ.

"మీకలవాటేమో? మాడిపోయిన కూరలు తినే అలవాటు మా ఇంటా వంటా లేదు. నేను పుట్టి బుద్ధెరిగాక" అని చొక్కా వేసుకుని ఇంట్లోంచి బయటకు నడిచాడు రాజా.

తిరిగి అతడింటికి చేరుకునేసరికి.. సామాన్ల సర్దుబాటింకా పూర్తికాకపోవడంతో అస్తవ్యస్తంగా ఉన్న ఆ సామాన్ల మధ్య చోటు చేసుకుని నేలమీదే పడుకుని గాఢంగా నిద్రపోతోన్న సమీర కనిపించిందతడికి.

ముందు గది తలుపు గడియ బిగించి మెల్లగా ఆమె పక్కన చేరి సమీర వంటిమీద చేయి వేశాడు రాజా. అంత నిద్రలోనూ అతడి చేతి స్పర్శకు ఉలిక్కిపడి లేచి అతడి చేతిని విదిల్చి కొట్టి "ఎక్కడ పడితే అక్కడ పడి పందుల్లా దొర్లడం మా ఇంటా వంటా ఎవరికీ అలవాటు లేదని తెలుసుకుంటే మంచిది" అని మరోవైపు తిరిగి పడుకుంది సమీర.



పళ్లు పటపటా కొరుకుతూ కాలికి అందుబాటులో ఉన్న వస్తువును కసిగా తన్నడం ద్వారా సమీర మీద తన కోపాన్ని తాత్కాలికంగా తీర్చుకుని కలత నిద్రపోయాడు రాజా ఆ రాత్రి.

మర్నాడతడు నిద్ర లేచేసరికి సమీర స్నానం చేసి బయటకు వెళ్లేందుకు సిద్ధమవుతూ కనిపించింది. కిటికీ అద్దాల గుండా లోపలికి పడుతోన్న సూర్య కిరణాల్ని చూస్తూ దిగ్గున లేచి, "నన్నూ లేపొచ్చుగా నువ్వొక్కదానివే లేచి తయారుకాకపోతే!" అన్నాడు రాజా.

"నిన్నంతా కష్టపడి అలసిపోయావు కదా అని జాలిపడి లేపలేదులే! నేను వెళ్తున్నాను. నాకు ఆఫీస్‌కు టైమైంది. ఈ రోజెటూ నువ్వు సెలవు పెట్టావు కనుక తీరిగ్గా తయారై నేనింటికొచ్చేసరికి ఇల్లంతా సర్దుంచు." అని చకచకా బయటకు నడిచింది సమీర.

సాయంత్రం సమీర తిరిగి ఇంటికొచ్చేసరికి ఇంటి పరిస్థితిలో ఏమీ మార్పు లేదు. ఎక్కడి వస్తువులక్కడే ఉన్నాయి. ఒక అట్టపెట్టెమీద విలాసంగా రెండు కాళ్లు చాపి కూర్చుని ఓ చేతిలో టీవీ రిమోట్‌తోనూ మరో చేతిలో సిగరెట్‌తోనూ కనిపించాడు రాజా. ఆ దృశ్యం చూడగానే అంతులేని కోపం వచ్చింది సమీరకు.

"నేను చెప్పిందేవిటి? నువ్వు చేసిందీ, చేస్తున్నదీ ఏవిటి?" అంది కోపాన్ని నిగ్రహించుకోలేక.

ఆమెవైపు తలైనా తిప్పకుండా అన్నాడు రాజా. "ఇల్లు సర్దుకోవడం, బట్టలుతకడం, మొగుడికి నచ్చేలా వండిపెట్టడం ఆడదాని పనే కానీ మగాడిది కాదని మీ అమ్మా నాన్నా నీకు చెప్పలేదా ఎప్పుడూ?"

"మా అమ్మకు సాయం చేయడానికి మా నాన్నెప్పుడూ నీలా వంకలు వేసుకోలేదు. సమయం, సందర్భాన్ని బట్టి మా అమ్మ అడక్కుండానే అన్నీ తానై చూసుకునే వాడు మా నాన్న." అంది గర్వంగా సమీర.

"అంటే మీ నాన్న భార్య చాటు మొగుడన్నమాట. మా నాన్న పులి! పులంటే పులే! మా నాన్నను చూస్తేనే మా అమ్మ గజగజా వణికిపోయేది తెలుసా? ఎప్పుడో ఎందుకు, ఇప్పటికీ మా నాన్నను చూస్తే మాకందరికీ గుండె దడగానే ఉంటుంది" అన్నాడు రాజా అదేదో గొప్ప విషయమన్నట్టుగా.

"మీ నాన్నలా నువ్వు గాండ్రిస్తే భయపడ్డానికి నేను మీ అమ్మలా మేకపిల్లను కానని నువ్వు తెలుసుకుంటే మంచిది" అంది సమీర అతణ్ని

## గుడ్‌బై టు చెన్నయ్?

కేరళ కుట్టి అశిన్ ఇప్పుడు తెలుగు, తమిళ సినిమాల్లో నటించడానికి ఏమంత ఉత్సాహంగా లేదని అర్థమవుతోంది. ఇంతకాలం చెన్నయ్‌లోనే మకాం వేసిన అశిన్ హిందీ 'గజిని'లో చాన్స్ వచ్చాక టెంపరరీగా ముంబాయిలోనే వుండేది. వస్తున్న అవకాశాలను దృష్టిలో వుంచుకుని ఇక ముంబాయికి తన మకాం మార్చేయాలని అనుకుంటోందిట. ఇందుకు నిదర్శనంగా తన చెన్నయ్ ఇంటిని ఖాళీ చేసేసి కుటుంబ సభ్యులతో ముంబాయి చేరుకుందిట అశిన్. చెన్నయ్‌లోని ఇంటిని అమ్మేయాలని కూడా అనుకుంటోందని కోలీవుడ్ టాక్.

తీక్షణంగా చూస్తూ.

"విషయం సరిగా అర్థం చేసుకోకపోవడమే కాకుండా పెద్దవాళ్ల పట్ల కనీస గౌరవం లేకుండా నోటి కొచ్చినట్టు మాట్లాడతావనేనా పెద్దవాళ్లను ఒప్పించి నేను నిన్ను పెళ్లి చేసుకున్నది" అన్నాడు రాజా నిలదీస్తు న్నట్టుగా.

"నీ నవ్వు బావుంది. నీ నడక బావుంది. నీ మన సెంత మంచిది! నిన్ను కన్నవాళ్లెంత అదృష్టవంతులో! నీ చేయి పట్టుకోబోయే వాడెంత భాగ్య శాలో అని స్తోత్రం చేస్తూ నా చుట్టూ ఉపగ్రహంలా తిరిగిన నిన్ను నమ్మి నీతో పెళ్లికి ఒప్పుకున్నాను చూడు. అందుకు నన్ను నేనే నిందించుకోవాలి తప్ప నువ్వు బాధపడడమెందుకు?" అంది సమీర వెటకారంగా.

"అవునవును. 'పిల్ల ఎర్రగా బుర్రగా ఉందని మురిసిపోవడం కాదురా అబ్బాయ్! పైగా నీ కంటే పెద్ద ఉద్యోగమే చేస్తోందంటున్నావ్! పెళ్లయ్యాక నిన్నసలు లెక్క చేస్తుందో లేదో' అని మా వాళ్లెంత హెచ్చరిం చినా వినకుండా కాళ్లావేళ్లా పడి వాళ్లను ఒప్పించడానికి ఎన్ని పాట్లు పడ్డానో నీకేం తెల్సు? నాతో ప్రేమా, పెళ్లీ ఇష్టం లేనట్టుగా బెట్టుచేసి నీ చేయే పైనుండేలా చూసుకున్న నిన్ను పెళ్లి చేసుకోడం కంటే పెద్ద పొరపాటు ఏదీ ఉండబోదు" అన్నాడు రాజా చివరి వరకూ కాలిన సిగరెట్‌ను నోట్లోంచి తీసి దానితో మరో కొత్త సిగరెట్ వెలి గిస్తూ.

"ఏదో అప్పుడప్పుడూ పార్టీల్లో తప్ప సిగరెట్ కాల్చడం అలవాటు లేదని చెప్పిన నువ్వు ఒకటి పూర్తి కాక ముందే మరొకటి వెలిగిస్తున్నావంటే నువ్వు నాకింకా ఎన్ని అబద్ధాలు చెప్పావో!" అంది సమీర కళ్లు పెద్దవి చేస్తూ.

"అవును. నిజం చెప్తే నీ అంత అద్భుత సౌందర్యరాశీ, సుగుణాల కుప్పా ఇహ నాకు దొరకదని అబ ద్ధాలు చెప్పి నీ మెళ్లో తాళి కట్టి, నా మెళ్లో పలుపుతాడు తగిలించుకు న్నాను. సరేనా?!" అన్నాడు రాజా వెట కారంగా.

☆ ☆ ☆

"సమీర సంసారం పరిస్థితేవీ బావున్నట్టు లేదండీ!" అంది అరవింద కాఫీ కప్పు భర్తచేతికి అందిస్తూ.

"అదే విషయం నేనూ నీతో చెప్దామనుకుంటు న్నాను" అన్నాడు నరేంద్ర.

"సమీర గురించేనా?" అంది అరవింద ఆసక్తి కన బరుస్తూ.

"ఆ.. ఒక రకంగా చెప్పాలంటే వాళ్లిద్దరి గురిం చీనూ" అన్నాడు నరేంద్ర.

"రాజా కూడా మీతో ఈ విషయం ప్రస్తావిం చాడా?" అంది అరవింద.

"అవును.. సమీర నీతోనూ, రాజా నాతోనూ వారి వారి వాదనలు వినిపించడమూ మనం సర్ది చెప్పడమూ గత నాలుగేళ్ల నుంచీ జరుగుతున్నదేగా!" అన్నాడు నరేంద్ర నిట్టూరుస్తూ.

"ఈసారి మాత్రం సమీర నా మాట వినేలా కనబ డటం లేదు" అంది అరవింద దిగులుగా.

"రాజా కూడా అంతకంటే తీవ్రంగానే స్పందిం చాడీ రోజు. ఇహ సమీరతో కలిసి ఉండే ప్రసక్తి లేదనీ, ఇంత కాలమూ ఆమెతో కాపురం చేయ డమే గొప్ప విషయమనీ వాపోయాడు నా దగ్గర" అన్నాడు నరేంద్ర.

"పెళ్లయిన కొత్తల్లో భార్యాభర్తల మధ్య చిన్న చిన్న అపార్థాలు అన్ని సంసా రాల్లోనూ వస్తాయి. మనకు మాత్రం రాలేదూ?" అంది అరవింద గతం గుర్తుచే సుకుంటూ.

"మన సంగతి వేరు అరూ. మన ప్రేమకు పునాది అభిప్రాయాల కలయికే తప్ప ఆకర్షణ కాదు. ఆకర్షణే పునాదిగా ఉన్నప్పుడు దాని మీద కట్టే పెళ్లనే భవంతి ఎక్కువ కాలం నిలబడుతుందని చెప్పలేం!" అన్నాడు నరేంద్ర.

"మీరు చెప్పేది నిజమే! ఇదే విషయం గతంలో మీరు ప్రస్తావించినపుడు నేను ఎంత గొడవ చేశానో ఇప్పటికీ నాకు గుర్తుంది" అంది అరవింద.

"అమ్మో ఆ విషయం గుర్తొస్తేనే నాకు భయం వేస్తుంది. నీ అందం చూసి నిన్ను ప్రేమించలేదని నేను చెప్పినప్పటికి నీ విశ్వ రూపం తలచుకుంటేనే నాకు వణుకు పుట్టుకొస్తుంది ఇప్పటికీ" అన్నాడు నరేంద్ర భయం నటిస్తూ.

"నిజమండీ.. ఆడదానికైనా మగాడి కైనా ఎదుటివారిని ఆకర్షించే కనీస బాహ్య రూపం అవసరమే! మగాడు స్థూలంగా ఆడదాని ఒంపుసొంపులకు ఎక్కువగా ఆకర్షింపబడితే ఆడది మగాడి సత్ప్రవర్తనకూ, అతడు తన పట్ల చూపించే ఆసక్తికీ, వాత్సల్యానికీ, సంభాషణా చతు రతకూ అతడికి దగ్గరవుతుంది. కొన్నాళ్లు కాపురం చేశాక మగాడికి ఆడదాని ఒంపు సొంపుల మీద మోజు తగ్గడమనే ప్రక్రియ అతడి ప్రమేయం లేకుండానే మనసులో ప్రారంభమై క్రమేణా అతడిలో దిగి ఉన్న అసలు గుణాలు బయటపడతాయి.

మీలాంటి తెలివైన మగాడైతే.. ఒకవేళ నిజంగా తనలో భార్య మెచ్చని గుణాలు ఉన్నప్పటికీ వాటిని బయటపడకుండా ఉండేలా జాగ్రత్త పడుతూ 'మంచి భర్త'



## నేను రెడీగా లేను

సల్మాన్‌ఖాన్-కత్రినా కైఫ్‌ల ప్రేమాయణం గురించి చాలా కాలంగా వినిపిస్తున్నదే. ఇదే విషయమై కత్రినా తాజాగా మాట్లాడుతూ- 'సల్మాన్‌తో నా 'దోస్తీ'ని నేనేమీ ఖండించను. ఎందుకంటే మేమిద్దరం మంచి ఫ్రెండ్స్‌మి. ఇక మా పెళ్లిగు రించి అంటారా? ఓ రకంగా సల్మాన్ నన్ను పెళ్లాడ్డానికి ప్రస్తుతం రెడీ అన్నా కూడా నేను మాత్రం అందుకు సిద్ధంగా లేను. ఎందుకంటే నా దృష్టంతా నా కెరీర్ మీదే వుందిప్పుడు. సో, నా పెళ్లి గురించిన ఊహలకు, వార్తలకు కాస్త ప్రస్తుతం తెర వేస్తే మంచిదని అనుకుంటున్నాను- అంటోంది.

"అనే బిరుదును కొట్టేస్తాడు" అంది అరవింద అల్లరిగా చూస్తూ.

"ఇదేవిటి? హఠాత్తుగా మన సంభాషణ ప్రమాదకరమైన మలుపు తిరిగినట్టుంది? కొంపదీసి సమీర నిన్ను ఆవహించలేదు కదా!" అన్నాడు నరేంద్ర కంగారు నటిస్తూ.

పకపకా నవ్వి అంది అరవింద. "నా ట్రిక్కులకు మీరు లొంగరని ఇన్నేళ్ల కాపురంలోనూ తెలుసుకున్న తర్వాతే కదా నేను మీకు పూర్తిగా లొంగిపోయింది!"

"భార్యాభర్తలు ఒకరికొకరు లొంగిపోవడమనే మాట వింటేనే అదోలా ఉంటుంది నాకు. అసలు భార్యాభర్తల మధ్య ఒకరు ఎక్కువ మరొకరు తక్కువా అనే ప్రసక్తి ఎక్కడ ఉంది?" అన్నాడు నరేంద్ర.



"ఇదిగో.. ఇటువంటి మాటలు మీ నోటి వెంట వినే నేను మీకు లొంగిపోయింది. నువ్వు తక్కువా, నేనెక్కువా కాదనే భర్త మాటలు విని అతడికి దాసోహమేనని భార్య ఉంటుందా ఈ లోకంలో!" అంది అరవింద, నరేంద్రను ఆరాధనగా చూస్తూ.

భార్య వైపు మురిపెంగా చూస్తూ అన్నాడు నరేంద్ర. "నేనెంతో అదృష్టవంతుణ్ని అరూ.. నా బలహీనతలు తెల్సినా వాటినెన్నడూ ఎత్తి చూపించే ప్రయత్నం చేయలేదు నువ్వు. నువ్వు కోరిన చిన్న చిన్న కోరికల్ని నేను తీర్చలేకపోయిన సందర్భాల్లో కూడా నీ అసంతృప్తిని సూచనప్రాయంగా చెప్పి ఊరుకునే దానివి తప్ప నన్ను దేనికీ నిలదీయలేదు. తన అసహాయతను అర్థం చేసుకుని తదనుగుణంగా ప్రవర్తించే భార్యంటే ఏ మగాడికి ఇష్టం ఉండదు చెప్పు!"

"నాకసలే గర్వం ఎక్కువ. నన్నలా పొగిడి మిమ్మల్ని మీరు చిన్నబుచ్చుకోకండి. తన తల్లిదండ్రుల్ని ప్రేమించే భార్యను ఇష్టపడని మగాడుండడు సాధారణంగా. కానీ అత్తమామల్ని కూడా తన తల్లిదండ్రుల్లాగే అభిమానించే భర్తను చూసి పొంగిపోకుండా ఉంటుందా ఏ భార్య అయినా!" అంది అరవింద భర్తవైపు మెచ్చుకోలుగా చూస్తూ.

అత్తమామలు తమ అల్లుణ్ని కొడుకులా భావించినపుడు అతడు తన అత్తమామల్ని తల్లిదండ్రుల్లా అభిమానించడంలో వింతేముంది?" అన్నాడు నరేంద్ర అదో పెద్ద విషయం కాదన్నట్టుగా.

"ఎంత ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యాభర్తలైనా ఎవరి హద్దుల్లో వారున్నంతవరకూ వారి సంసార నౌక సజావుగానే సాగిపోతుంది. ఇద్దరిలో ఏ ఒక్కరు హద్దు దాటినా ఆ ప్రయాణంలో ఆటుపోట్లు తప్పవు. సమీర, రాజాల సంసారం సరైన దారిలో పడే అవకాశం లేదంటారా?" అంది అరవింద తమ అసలు విషయం వదిలేసి మరేదో విషయం మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నామని స్ఫురణకు వచ్చి.

"రాజా కూడా ఈ విషయంలో చాలా పట్టుదలగా ఉన్నాడు. కానీ నా అనుమానాలు నాకున్నాయి" అన్నాడు నరేంద్ర ఏదో ఆలోచిస్తూ.

"నాకు మాత్రం వాళ్లిద్దరూ విడిపోవడం తప్పదేమో అనిపిస్తోంది. గత ఏడాది కాలంలోనూ వాళ్లిద్దరూ భార్యాభర్తల్లా సాంసారమే చేయలేదని చాలా విరక్తిగా చెప్పింది సమీర" అంది అరవింద బాధగా.

"చిత్రంగా రాజా కూడా అదే మాటన్నాడు నాతో ఇవ్వాళ. ఆలుమగల గొడవలు ఎటువంటివైనా పడకగది బయటి వరకే పరిమితం అనే విషయం కూడా వీరిద్దరి మీదా ఎటువంటి ప్రభావమూ చూపించలేదంటే ఒకరి పట్ల మరొకరికి కనీసం శారీరకపరమైన ఆకర్షణ కూడా లేనంతగా వ్యవహారం చెడిపోయిందనిపిస్తోంది.

శారీరక సుఖం పొందే విషయానికొచ్చేసరికి మగాడు ఆడదానితో పోలిస్తే బలహీనుడనే చెప్పాలి. చరిత్ర నిరూపించిన వాస్తవం ఇది. మనసు లేకుండా మొగుడైనాసరే అతడితో అనుభవం పంచుకుందుకు ముందుకు రాదు స్త్రీ.

మగాడి విషయం ఇందుకు పూర్తిగా భిన్నం. మనసు సంగతి పక్కన పెట్టి సందర్భానికి తగినట్టుగా సరిపెట్టుకునే మనస్తత్వం సగటు మగాడిది. ఆడవాళ్లలోనూ, మగవాళ్లలోనూ కూడా ఇందుకు మినహాయింపులు ఉండవచ్చు. అందుకు కారణాలు వేరే ఉండొచ్చు" అన్నాడు నరేంద్ర.

ఏదో భావావేశంలో అలా అన్నప్పటికీ తర్వాత ఎందుకో అనిపించింది నరేంద్రకు. తను అధిక ప్రసంగం చేశాడేమోనని, కానీ అప్పటికే జరగవలసిన ప్రమాదం జరిగిపోయింది.

"వాళ్లిద్దరి విషయమూ అలా ఉంచి మీ సంగతి చెప్పండి. మీరు అందర్లాంటి మగాడి కోవకే చెందుతారా లేక మీరు చెప్పిన మినహాయింపుల వర్గంలోకి వస్తారా?" అంది అరవింద.

ఆమె మొహంలో ఎటువంటి అల్లరి భావమూ కనబడకపోవడంతో కొంచెం కలవరపడ్డాడు నరేంద్ర. "తప్పైపోయింది అరూ.. నిస్సందేహంగా నేను మాట్లాడింది తప్పే! అసలు విషయం వదిలేసి నన్ను నేను పెద్ద మానసిక నిపుణుడిలా భావించుకుని ఏదో నోటికొచ్చింది వాగేశాను.

## పబ్లిసిటీ కోసం...

ఇటీవల ప్రభుదేవాతో ప్రేమాయణం-పెళ్లి గురించిన వార్తలతో తెగ పాపులారిటీ తెచ్చేసుకున్న నయనతార- ఆ విషయమై సరైన క్లారిఫికేషనేదీ ఇంతవరకూ ఇవ్వకపోవడం విచిత్రమే. అయితే ఇది కేవలం 'పబ్లిసిటీ' కోసమే అనేది సినీపండితులు చాలామంది అభిప్రాయంగా వినిపిస్తోంది. అదలా వుంటే బాలీవుడ్‌లోకి ప్రవేశించే యత్నాల్లో భాగంగానే ఈ ప్రచారమంతా అనేది కూడా ఓ కథనం. అసిన్ తర్వాత తాజాగా త్రిష హిందీలోకి వెళ్తోందిప్పుడు. తను మాత్రం ఏం తక్కువ తిన్నాననుకుని నయనతార కూడా బాలీవుడ్ ట్రయల్స్ చేస్తున్నట్టు వినికిడి.

అంతేకాకుండా గొప్ప చరిత్ర పరిశోధకుడిలా 'చరిత్ర నిరూపించిన వాస్తవం' అని కూడా వాక్రుచ్చాను. నా మాటల్ని నేను సవినయంగా వెనక్కు తీసుకుంటున్నాను" అన్నాడు లెంపలు వేసుకుంటూ.

"ఊహూ నిప్పు లేందే పొగరాదు. మీరింతకాలమూ లేదా కొంతకాలమైనా లేదా కనీసం కొన్నిసార్లయినా మనసు లేకుండా నాకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారా? అని చెప్పండి ముందు" అంది అరవింద పట్టువీడకుండా.

"మా బంగారు కొండవు కదూ! నా మీద ఆ మాత్రం నమ్మకం లేదా?" అన్నాడు నరేంద్ర అరవింద గడ్డం పట్టుకుని బ్రతిమాలుతూ.

"ఊహూ.. ఇది చిన్న విషయం కాదు. మీ పట్ల నాకున్న నమ్మకానికీ, మీకు నామీదున్న ప్రేమకూ సంబంధించిన విషయం ఇది. నిజాయితీగా చెప్పండి. మీ సమాధానం ఎటువంటిదైనా నేను తట్టుకోగలను. సమీరలా విడాకుల వరకూ వెళ్లనని హామీ ఇస్తున్నాను." అంది అరవింద.

"అయ్యో .. అరూ...నీకెలా చెప్పను? సాధారణంగా మగాడి మనస్తత్వం ఎలా ఉంటుందో చెప్పే ప్రయత్నం చేశానంతే తప్ప నేనటువంటి వాణ్ణని నీకెప్పుడైనా అనుమానం కలిగేలా ప్రవర్తించానా నువ్వే చెప్పు!" అన్నాడు నరేంద్ర అనునయంగా.

"అదే నా అనుమానం కూడా.. ఒక్కసారి.. ఒక్కసారంటే ఒక్కసారి కూడా మీరు మనసు చంపుకుని నాకు దగ్గర కాలేదా?!" అంది అరవింద రెట్టిస్తూ.

"నిన్నెలా నమ్మించాలో నాకు తెలియడం లేదు. అరూ.. నేను ఏ రోజైనా కోపంగా ఉంటే నువ్వు సహనంతో దాన్ని జయించేదానివి. నేను నిరాసక్తంగా ఉన్నప్పుడు సరదాగా కబుర్లు చెప్పి నన్ను మామూలు స్థితికి తీసుకొచ్చేదానివి.

నేను చెప్పకుండానే నా మనసులో ఉన్నవన్నీ తెల్సుకుని అందుకనుగుణంగా ప్రవర్తించే నీకు నేను మరో విధంగా దగ్గర కావాల్సిన అవసరం ఎందుకొస్తుంది చెప్పు" అన్నాడు నరేంద్ర 'ఈ చర్చకింతటితో ముగింపు పలకవా?' అన్నట్టు దీనంగా చూస్తూ.

"ఏమో నాకు నమ్మకం కుదరడం లేదు. మీరు చాలా లోతు గుండె మనిషి. ఇహ నుంచీ మిమ్మల్ని పరిశీలనలో ఉంచుతానులెండి. ఎప్పుడో ఒకప్పుడు నాకు దొరక్కపోరు. ఇహ సమీర, రాజాల విషయానికొద్దాం. వాళ్లిద్దరూ విడిపోకుండా మనమేం చేయలేమా?" అంది అరవింద.

తనను ముంచెత్తుతుందనుకున్న ఉప్పెన తాత్కాలికంగానైనా దారి మార్చుకోవడంతో ఊపిరి పీల్చుకుని అన్నాడు నరేంద్ర. "నాకు తెలిసినంత వరకూ వాళ్లిద్దరి సంసారానికి వచ్చిన ముప్పేమీ లేదు. వాళ్లెప్పటికీ విడిపోరు"

"అదేమిటీ.. అంత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారు? మీరే అన్నారుగా.. రాజా కూడా ఈ విషయంలో చాలా పట్టుదలగా ఉన్నాడనీ!" అంది అరవింద భర్త మనసులో ఏం ఉందో ఊహించే ప్రయత్నం చేస్తూ.

"అవును.. రాజా పట్టుదలగా ఉన్న మాట నిజమే! కానీ ఆ పట్టుదల వెనుక ఉన్నది ఆత్మగౌరవం కాదు. ఆత్మ న్యూనత. నాకు తెలిసినంత వరకు రాజా వ్యక్తిత్వం బలమైనది కాదు. కొంచెం ప్రేమ చూపిస్తే ఇట్టే కరిగి పోతాడు. కాకపోతే పాతతరం ఆలోచనలున్నవాడు. ఇహ సమీర విషయానికొస్తే తన వ్యక్తిత్వం రాజా వ్యక్తిత్వం కంటే బలమైనది. 'నాకే తెలియని విషయం మీకెలా తెలిసిందని నన్ను మళ్లీ నిలదీయకు! వాళ్లిద్దర్నీ కాస్తోకూస్తో దగ్గరగా పరిశీలించినవాడిగా చెప్తున్నాను. సమీర విడాకులు కావాలని కోరుకున్నా రాజా అందుకు సమ్మతించడు. పైకి చెప్పకపోయినా సమీర మానసికంగా తన కంటే పై స్థాయిలో ఉందని రాజాకు అంతరాంతరాల్లో తెలుసు. కానీ ఆ విషయాన్ని పైకి ఒప్పుకోలేని పురుషాహంకారం కూడా అతనిలో ఉంది.

సమీర తన మనసులో ఎలా భావించినా పైకి మాత్రం రాజా మనసు సంతోషపడేలా ప్రవర్తించగలిగితే లేదా కనీసం నటిస్తే వారి సంసారానికి ఏ ఢోకా ఉండదు.

ఇద్దరు బలమైన వ్యక్తిత్వాలు గల వాళ్లు లేదా మొండివాళ్లు లేదా మూర్ఖుల మధ్య వ్యవహారం బెడిసికొట్టినపుడు అది విడాకుల వరకూ వెళ్తే వెళ్లొచ్చు. కానీ సమీరలా బలమైన వ్యక్తిత్వమున్న భార్యకూ, రాజా వంటి బలహీనమైన వ్యక్తిత్వం గల భర్తకూ మధ్య ఎన్ని గొడవలున్నా అవి ఎంత తారాస్థాయికి చేరినా, మహా అయితే ఇద్దరూ కొంతకాలం విడిగా ఉండడం జరుగుతుందేమో గానీ విడాకుల వరకూ వెళ్లే అవకాశాలు చాలా తక్కువ." అన్నాడు నరేంద్ర.

"మీరు చెప్పిందే నిజం కావాలని మనసారా కోరుకుంటున్నాను. కానీ నాకో అనుమానం ఉండిపోయింది. అడగమంటారా?" అంది అరవింద సీరియస్‌గా మొహం పెట్టి.


అర్థం కానట్టు చూశాడు నరేంద్ర.

"అదే.. అదే.. మనిద్దరం విడాకులు తీసుకునే సందర్భం మున్ముందు ఎప్పుడైనా వస్తుందంటారా?"

ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా జవాబిచ్చాడు నరేంద్ర. "ఆ.. మరో ఏడు జన్మల తర్వాత..."

"ఊహూ.. ఎనిమిదో జన్మలో కూడా నేనే మీ పెళ్లాన్నీ, ప్రేయసినీ!" అంది అరవింద నరేంద్ర జుట్టులో వేళ్లు జొనిపి అతడికి దగ్గరగా జరుగుతూ.

☆



## జెనీలియా 'కథ'

తనదైన ప్రత్యేకత గల పాత్రల్ని పోషించడంలో జెనీలియా స్టయిలే వేరు అనే పేరు సంపాదించుకుంది. తాజాగా ఆమె నటిస్తున్న 'కథ' సినిమా కూడా ఆ కోవలోకి చేరుతుందని టాలీవుడ్ కబుర్లు. ఓ కొత్త హీరోకి జంటగా కొత్త దర్శకుడితో జెనీలియా చేస్తున్న 'కథ' ఆమెకి మరింత ఖ్యాతిని తెస్తుందని సినీవాలాలు చెబుతున్నారు. ప్రస్తుతం హిందీ రంగంపైనే ఎక్కువగా తన ఫోకస్‌ని పెట్టిన జెనీలియా 'కథ' కనుక హిట్టయితే వచ్చే ఆఫర్లని మరి ఎంతవరకూ ఒప్పుకుంటుందో!